క్లుప్తంగా

సైబర్ నేరాలపై అవగాహన



ఖిలా వరంగల్: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇన్‌స్పెక్టర్ ముష్క శ్రీనివాస్ సూచించారు. ఏసీపీ గిరికుమార్ ఆదేశాలు వరంగల్ శంభునిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్సై శ్రీలత ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, 1930 టోల్‌ఫ్రీ నంబర్‌పై సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ అపరిచితుల నుంచి మొబైల్‌కు వచ్చే కాల్స్, మెసేజ్‌లు, లింక్‌లకు స్పందించవద్దని అన్నారు. అలాగే, ఫోన్‌కు వచ్చే ఓటీపీ చెప్పవద్దని పేర్కొన్నారు. సైబర్ మోసానికి గురైనట్లు గ్రహిస్తే వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

చెరువు కబ్జాపై జాయింట్ సర్వే



హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం ముచ్చర్లలోని ఊర చెరువు కబ్జాపై వచ్చిన ఆరోపణలపై నీటి పారుదల శాఖ, రెవెన్యూశాఖ అధికారులు సోమవారం జాయింట్ సర్వే నిర్వహించారు. నీటి పారుదలశాఖ డీఈఈ రాజు ఆధ్వర్యంలో పరిశీలించారు. పట్టాతో పాటు చెరువు శిఖం కొలతలు వేశారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ ఎర్రపెగడ, స్థానికులు పాల్గొన్నారు.

'కేసీఆర్‌కు ఓట్ల మీదే ధ్యాస'



కాజీపేట: సీఎం కేసీఆర్‌కు ఎన్నికలు, ఓట్లు, సీట్ల మీద ఉన్న ధ్యాస ప్రజా సమస్యల పరిష్కారంపై ఉండకపోవడం బాధాకరమని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్‌రెడ్డి విమర్శించారు. కాజీపేట మండలం సోమిడి యాదవనగర్ కాలనీలో కార్యకర్తలతో కలిసి సోమవారం పాదయాత్ర నిర్వహిస్తూ ప్రజల సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. ఈక్రమంలో క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజలు ఏకరువు పెట్టారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు చిర్ర నర్సింగ్ గౌడ్, మేకల శ్రావణ్ యాదవ్, ఓంకార్, కరుణాకర్, శ్రీకాంత్, వినయ్, కుమార్ పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి చేయూత



హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం చింతగట్టులోని జిల్లా పరిషత్ పాఠశాలకు దాతలు చేయూతనిచ్చారు. పాఠశాలలో సుమారు రూ.5 లక్షల వ్యయంతో అధునాత టాయిలెట్లు నిర్మించనున్నారు. ఈమేరకు సంబంధిత పనులను ప్రధానోపాధ్యాయురాలు వాసంతి సోమవారం ప్రారంభించారు. బిల్లా హేమలత, అన్వదా ఫౌండేషన్ సహకారంతో జరిగిన కార్యక్రమంలో పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ మల్లేశం, అన్వదా ఫౌండేషన్ ప్రతినిధి పద్మ, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుధాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడలు ప్రారంభం



కేయూ క్యాంపస్: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడుతాయని సుబేదారి ఇన్‌స్పెక్టర్ ఎం ఏ.సుకుర్ తెలిపారు. కళాశాల మైదానంలో క్రికెట్ పోటీలను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బన్న అయిలయ్య, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ హనుమంతు, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఏటీబీటీ ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

దేశీ మిర్చికి రికార్డు ధర

వరంగల్ రూరల్: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం దేశీ మిర్చి క్వింటాల్‌కు రికార్డు స్థాయి ధర పలికింది. మార్కెట్ చరిత్రలోనే ఈ సీజన్‌లో క్వింటాలుకు రూ.81వేలు పలికింది. భూపాలపల్లికి జిల్లా చెల్పూరు మండలం దుబ్బపల్లికి చెందిన మిర్చి రైతు పల్లెపాటి విద్యాసాగర్ మూడు బస్తాల దేశీ కొత్త మిర్చి అమ్మకానికి తీసుకువచ్చారు. సాగర్ ట్రేడర్స్ అడ్తి సిఫారసు మేరకు భాగ్యలక్ష్మి ట్రేడర్స్.. క్వింటాల్‌కు రూ.81వేలతో కొనుగోలు చేసింది. అలాగే వండర్‌హాట్ మిర్చి క్వింటాల్‌కు గరిష్ఠ ధర రూ. 36 వేలు, కనిష్ఠ ధర రూ.30 వేలు పలికిందని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి బి.వి.రాహుల్ తెలిపారు. పత్తి క్వింటాల్‌కు గరిష్ఠ ధర రూ. 7,755, కనిష్ఠ ధర రూ.6,400 పలికిందని ఆయన వివరించారు.

మామునూరు: మౌనం పాటిస్తున్న పీటీసీ ప్రిన్సిపాల్ పూజ, పోలీసు అధికారులు



హన్మకొండ: ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో నివాళులర్పిస్తున్న గోపాల్‌రావు, డైరెక్టర్లు



వరంగల్ స్టేషన్‌రోడ్డులో గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు



జాతిపిత గాంధీకి ఘన నివాళి



హసన్‌పర్తి: నివాళులర్పిస్తున్న వాసవిక్లబ్ సభ్యులు



రామన్నపేటలో ఐవీఎఫ్ ప్రతినిధులు



వరంగల్ చౌరస్తాలో..

మామునూరు: శాంతిమార్గంలో విదేశీ పాలన నుంచి జాతికే విముక్తి కలిగించిన మహనీయుడు జాతిపిత మహాత్మగాంధీ అని పీటీసీ ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ (ఎస్పీ) కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు ప్రతీఒక్కరు కృషి చేయాలని సూచించారు. ఖిలా వరంగల్ మండలం మామునూరు పోలీస్ శిక్షణ కళాశాల ప్రాంగణంలో పరిపాలన అధికారుల ఆధ్వర్యంలో మహాత్మగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీఎస్పీలు రమేష్, శ్రీనివాస్, అసిస్టెంట్ కమాండెట్లు భిక్షపతి, పాండు, ఆర్‌ఐలు చంద్రశేఖర్, నవీన్, కాశీరామ్, సీఎల్‌ఐలు నరేష్, రవీందర్, ఏఓ ఫర్హానా, డాక్టర్ సుధీర్, ఫార్మసీ వెంకటేశ్వర్లు, పీఆర్ఓ రామాచారి తదితరులు పాల్గొన్నారు.

అమరులకు నివాళి

హన్మకొండ: దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో అసువులు బాసిన అమరులకు టీఎస్ ఎన్పీడీసీఎల్ పాలకవర్గం సభ్యులు నివాళి అర్పించారు. నక్కలగుట్టలోని టీఎస్ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో సీఎండీ ఎ.గోపాల్‌రావు, డైరెక్టర్లు బి.వెంకటేశ్వర్ రావు, పి.గణపతి, పి.సంధ్యారాణి, వి.తిరుపతి రెడ్డి, అధికారులు, ఉద్యోగులు మౌనం పాటించారు.

స్టేషన్‌రోడ్డులో గాంధీకి నివాళి

వరంగల్ చౌరస్తా: వరంగల్ స్టేషన్ రోడ్డులోని మహాత్మగాంధీ కమ్యూనిటీ హాల్‌లో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాశ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తుమికి రమేష్‌బాబు, నాయకులు కొమ్ము శ్రీధర్, కూచన రవీందర్, సందెల లాజర్, యువజన కాంగ్రెస్ వరంగల్ తూర్పు ఉపాధ్యక్షుడు ఎర్రం కమల్, యాట వీరప్రతాప్, చెరుకు సందీప్, అనిల్, కట్కూరి అన్వేష్, ఎర్రం మణిదీప్, గద్దల కార్తీక్, గూడ శారద, కర్నాటి సురేఖ, పోలెపాక భావన, తదితరులు పాల్గొన్నారు.

హసన్‌పర్తిలో..

హసన్‌పర్తి: జాతిపిత వర్ధంతి సందర్భంగా 66వ డివిజన్ హసన్‌పర్తిలో వాసవిక్లబ్ ఆధ్వర్యంలో మహాత్మగాంధీ విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వాసవిక్లబ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ చకిలం రాజేశ్వర్‌రావు, వాసవిక్లబ్ హసన్‌పర్తి శాఖ అధ్యక్షుడు చిదర కరంచంద్, కార్యదర్శి శ్యాంసుందర్, వాసవిక్లబ్ రీజియన్ చైర్మన్ లక్ష్మన్, జోన్ అప్పని శంకర్, మాజీ అధ్యక్షుడు భీష్మనాథం, గొరిశెట్టి కృష్ణమూర్తి, నాగమళ్ల సుధీర్, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఐవీఎఫ్ ఆధ్వర్యంలో..

రామన్నపేట: ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ (ఐవీఎఫ్) ఆధ్వర్యంలో మహాత్మగాంధీ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా అధ్యక్షుడు పుల్లూరు మధు, ప్రధాన కార్యదర్శి గుమ్మడవెల్లి సురేష్, మహిళా విభాగం అధ్యక్షురాలు వల్లాల శైలజ, భద్రకాళి దేవస్థానం మాజీ ధర్మకర్త తోనుపునూరి వెంకన్న, తోట హరీశ్, పద్మశాలి సంఘ జిల్లా అధ్యక్షుడు ఆడెపు రవీందర్, మాజీ కార్పొరేటర్ సత్యనారాయణ, వడ్నాల నరేందర్, అమర్‌నాథ్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

లౌకికవాద పరిరక్షణ అందరి బాధ్యత



సమావేశంలో మాట్లాడుతున్న శంకర్‌నారాయణ

ఖిలా వరంగల్: లౌకికవాద పరిరక్షణ అందరి బాధ్యత అని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ల్యాదల్ల శరత్, రిటైర్డ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మార్క శంకర్‌నారాయణ సూచించారు. వరంగల్ శంభునిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ శోభాదేవి అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. దేశంలో విభిన్న మతాలు, పలు భాషలు, అనేక జాతులు, సంస్కృతి సమ్మేళనమే భారత దేశమని వివరించారు. ప్రజాస్వామ్యంలో ప్రజలందరు స్వేచ్ఛగా తమ భావాలను ప్రకటించుకునే హక్కు ఉందని గుర్తుచేశారు. లైంగికవాదం వద్దనడమంటే ప్రజాస్వామ్యాన్ని బొందపెట్టడమేనని వివరించారు. సమావేశంలో అధ్యాపకులు రూపారాణి, రజిత, లక్ష్మి, సుధాకర్, ఏఐఎస్ఎఫ్ నేతలు రాకేష్, శివకుమార్, సంతోష్, నిశాంత్, రాజు, సోను, చౌహన్, ఖలీల్, శ్రవణ్ పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధిపై సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న నరసింహారెడ్డి

వరంగల్: దేశాయిపేటలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ కుష్ఠు వ్యాధిపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారి డాక్టర్ భరత్‌కుమార్, జిల్లా ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ నరసింహారెడ్డి మాట్లాడుతూ కుష్ఠు వ్యాధి సాధారణమైన జబ్బు అని, ఆందోళన చెందకుండా వ్యాధిగ్రస్తులు తగిన చికిత్స తీసుకుంటే నయం అవుతుందని వివరించారు. అనంతరం వ్యాధిగ్రస్తులకు పండ్లు, దుప్పట్లు పంపిణీ, ఎంసీఆర్ చెప్పులు, అల్సర్ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో డీపీఎంఓ అనుపమ, సీఓ కోర్నెల్, యూపీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యానికి సర్కారు అధిక ప్రాధాన్యం



పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రజిత

హసన్‌పర్తి: వైద్యానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని కార్పొరేటర్ జక్కుల రజిత తెలిపారు. 55వ డివిజన్ భీమారంలో సుమారు రూ.20 లక్షల వ్యయంతో నిర్మించనున్న ఆరోగ్య ఉపకేంద్ర భవన నిర్మాణ పనులను కార్పొరేటర్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుపేదలకు వైద్యం అందుబాటులోకి తీసుకురావడానికి బస్తీ దవాఖానాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వెంకటేశ్వర్లు, వైద్యాధికారి డాక్టర్ వాణిశ్రీ, ఎర్రగట్టు దేవస్థాన చైర్మన్ లక్ష్మణ్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు రవీందర్, రైతుబంధు సమితి జిల్లా కార్యవర్గ సభ్యుడు విక్టర్ బాబు, బీఆర్ఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి నాయకపు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల గడువు పొడిగింపు

కాశీబుగ్గ సెంటర్: ఉపాధ్యాయుల బదిలీల ఆన్‌లైన్ దరఖాస్తు గడువును ఫిబ్రవరి 1వ తేదీ వరకు పొడిగించినట్లు వరంగల్ డీఈఓ వాసంతి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తుల్లో ఏమైన పొరపాట్లు ఉంటే ఫిబ్రవరి 1వ తేదీన ఉపాధ్యాయులు వాటిని సవరించుకునేందుకు అవకాశం కల్పించినట్లు ఆమె తెలిపారు.

ముగిసిన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాల్లో పూజలు చేస్తున్న అర్చకులు

వరంగల్ చౌరస్తా: వరంగల్ రామన్నపేట బట్టలబజారులోని వేంకటేశ్వర దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. చివరిరోజు సోమవారం చిన్న జీయర్ స్వామి శిష్య బృందం సభ్యుడు రాఘవాచారి మంత్రోచ్చరణల మధ్య పుష్పయాగం, ధ్వజారోహణ, కంకణ విసర్జ, ఆచార్య బ్రహ్మ రుత్విక్, ఆశీర్వచనాలు, ఏకాంత సేవ, తీర్థ ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో 28వ డివిజన్ కార్పొరేటర్ గందె కల్పన, ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎలపాటి రత్నాకర్‌రెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు గందె గోవిందరాజులు, ఆలయ సేవా సమితి సభ్యులు రవ్వ కృష్ణమూర్తి, గుమ్మడవెల్లి సత్యనారాయణ, వందనం శశిధర్, జూలూరి పున్నారావు, రేపాల సురేష్, గందె విజయ్‌కుమార్, కొండూరు జ్ఞానేశ్వర్, మధు, రవి, గుమ్మడవెల్లి అశోక్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

13 నుంచి 'హజ్రత్ దర్గా' ఉత్సవాలు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ఖిలా వరంగల్: మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే హజ్రత్ మాషుక్ దర్గా ఉర్సు ఉత్సవాలు ఫిబ్రవరి 13 నుంచి 15వ తేదీ వరకు వైభవంగా జరగనున్నాయని, భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కలెక్టర్ గోపి, సీపీ రంగనాథ్, కమిషనర్ ప్రావీణ్య, ఎమ్మెల్యే నరేందర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం దర్గా పీఠాధిపతులు సయ్యద్ పాషా హైదర్ హిలాల్‌యొద్దీన్ ఖాద్రీ (నవీద్‌బాబా), సయ్యద్ అలీషా ఖాద్రీ (ఉబేద్ బాబా)లతో కలిసి వారు ఉర్సు దర్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మరుపల్లి రవి, సిద్దం రాజు, కుడా మాజీ డైరెక్టర్ మోడెం ప్రవీణ్, తవక్కల్ వెల్ఫేర్ ట్రస్టు చైర్మన్ ఎంఏ జాబ్బర్, ముస్లిం మతపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మించాలి



నిరసన తెలుపుతున్న స్థానికులు

కాశిబుగ్గ: 18వ డివిజన్ క్రిస్టియన్‌కాలనీలో ఎస్సీ కమ్యూనిటీ హాల్‌ను నిర్మించాలని కాలనీవాసులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రిస్టియన్‌కాలనీలోని ఎస్సీకాలనీలో కమ్యూనిటీ హాల్, పార్కు, పబ్లిక్ మరుగుదొడ్లు నిర్మిస్తామని పనులకు మూడేళ్ల క్రితం శంకుస్థాపన చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో సృజన, మల్లికాంబ, సావిత్రి, ప్రమీల, శోభ, లావణ్య పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

నీటి ప్రవాహంతో రోడ్లు ధ్వంసం

వరంగల్ అర్బన్: ఎస్ఆర్ఎస్పీ కెనాల్ నీరు రహదారిపై పారుతుండడంతో జ్యోతిబసునగర్ ఫేజ్-2కు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని కాలనీ వాసులు ఆందోళన చేశారు. ఈమేరకు రోడ్లపై మరమ్మతులు చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో బల్దియా ప్రధాన కార్యాలయం ఆవరణలో సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం, గ్రీవెన్ సెల్‌లో కమిషనర్ ప్రావీణ్యకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం హనుమకొండ నార్త్ కమిటీ కార్యదర్శి గాదె రమేష్, వెల్దండ భాస్కర్, క్రాంతి, స్వప్న, రజిత, మానస, అభిరామ్‌రాజ్, రాజేష్, గట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

పట్టా మార్పు చేయొద్దని వినతి

హసన్‌పర్తి: వంశపారంపర్యంగా వచ్చిన భూమిని తమకు తెలియకుండా పట్టా మార్పిడి చేయొద్దని రైతులు కోరారు. ఈమేరకు గ్రీవెన్స్‌లో కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతుకు సోమవారం ఫిర్యాదు చేశారు. హసన్‌పర్తి మండలం చింతగట్టు రెవెన్యూ పరిధిలోని 317/ఇ, 318/డి, 319/ఎఫ్ సర్వే నంబర్లలో సుమారు 1.18 ఎకరాల భూమి ఉందని రైతులు తెలిపారు. ఆ భూమిని కొంతమంది వ్యక్తులు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి పట్టా మార్పిడి చేయడానికి ప్రయత్నిస్తున్నారని బాధితులు బత్తుల రవీందర్, కుమారస్వామి, రవి పేర్కొన్నారు.

రాతికోటపై ముళ్ల పొదలను తొలగించాలి

ఖిలా వరంగల్: కాకతీయుల రాజధాని ఓరుగల్లు కోటలో రాతికోటపై ఏపుగా పెరిగిన ముళ్ల పొదలను తొలగించాలని పర్యాటకశాఖ గైడ్ రవియాదవ్ కోరారు. ఈమేరకు బల్దియా కార్యాలయంలో గ్రీవన్ సెల్‌లో సోమవారం వినతి పత్రం అందజేశారు. అలాగే, నాలుగున్న కిలోమీటర్ల రాతికోట చుట్టూ రోడ్డు వెంట శుభ్రం చేయించాలని సూచించారు.

ఆటోడ్రైవర్లు లైసెన్స్ కలిగి ఉండాలి

కాజీపేట: ప్రతీ ఆటోడ్రైవర్ విధిగా లైసెన్స్ కలిగి ఉండాలనే ఉద్దేశంతో పశ్చిమ నియోజకవర్గంలో ప్రత్యేక లైసెన్స్ మేళాను చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ ఏర్పాటు చేయించారని జిల్లా ఆర్టీఏ కమిటీ సభ్యుడు కాటపురం రాజు తెలిపారు. కాజీపేట పట్టణంలో రెండోరోజు సోమవారం లైసెన్స్ మేళాను రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా లైసెన్స్ కోసం 122 మంది ఆటోడ్రైవర్లు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో జాతీయ కమిటీ సభ్యుడు ఇసంపెల్లి సంజీవ, రాష్ట్ర అధ్యక్షుడు దేవర మల్లేష్, మంద శ్రీధర్, అలీ, ఎండీ.ఖాజా, మడికొండ బాబు, బండ లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన గీత కార్మికుడికి చేయూత

హన్మకొండ: ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి కిందపడి తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతున్న గీత కార్మికుడికి బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రవికృష్ణ ఆర్థిక చేయూతనందించారు. వరంగల్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం నైన్‌పాక గ్రామానికి చెందిన మంద రమేష్‌గౌడ్‌ను పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని సోమవారం అందించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్, గౌడ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్ శ్రీపతి గోపి గౌడ్, నాయకులు కాసగాని అశోక్‌గౌడ్, తాళ్లపెల్లి రమేష్ గౌడ్, ఏరుకొండ రమేష్ గౌడ్, ఎం.రాజు గౌడ్ పాల్గొన్నారు.

ఆపదలో 1098కు డయల్ చేయండి

హసన్‌పర్తి: బాలబాలికలు ఆపదలో ఉన్నప్పుడు 1098 టోల్‌ఫ్రీ నంబర్‌కు డయల్ చేయాలని చైల్డ్‌లైన్ జిల్లా కమిటీ సభ్యుడు బెజ్జంకి ప్రభాకర్ సూచించారు. 56వ డివిజన్ గోపాలపురంలో చైల్డ్‌లైన్-1098 ఆధ్వర్యంలో బాలల సేవలు, బాలల రక్షణపై ప్రజలకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణకు ప్రతీఒక్కరు కృషి చేయాలని కోరారు. అనంతరం చైల్డ్‌లైన్ -1098 కరపత్రాలను పంపిణీ చేశారు.

రిటైర్డ్ ఎయిడెడ్ ఉద్యోగుల డైరీ ఆవిష్కరణ

రామన్నపేట: వరంగల్ ములుగురోడ్డులోని లాల్ బహదూర్ కళాశాలలో విశ్రాంత ఎయిడెడ్ ఉద్యోగుల డైరీని సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ సీతారాంనాయక్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డీహెచ్.రావు, మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ధర్మేంద్రరావు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో అడ్మిషన్ల డైరెక్టరేట్ సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా సోమవారం ఢీకొన్నాయి. ఈ సంఘటనలో ఒకరికి స్వల్పగాయాలు అయ్యాయి. భీమారం నుంచి యూనివర్సిటీ క్యాంపస్ రెండోగేట్‌లో నుంచి మొదటి గేట్‌వైపు ఓద్విచక్ర వాహనం వెళ్తూ ఎదురుగా వచ్చే మరో బైక్‌ను అడ్మిషన్ల డైరెక్టరేట్ సమీపంలో ఢీకొట్టింది. దాంతో ఒకరికి గాయాలయ్యాయి.

డ్రెయినేజీ పనుల పరిశీలన



సాక్షి స్పందన

వరంగల్: నగరంలోని 21వ డివిజన్ మొయిన్‌పురాలో రూ.35 లక్షల వ్యయంతో చేపట్టిన సైడ్ డ్రెయినేజీ నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు లేకుండా జరుగుతున్నాయని సాక్షి దిన పత్రికలో సోమవారం వచ్చిన 'నాసిరకంగా అభివృద్ధి పనులు' అనే కథనానికి బల్దియా ఇంజనీర్లు స్పందించారు. ఈమేరకు పనులను డీఈ రవికిరణ్, ఏఈ సతీష్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అయితే, ఇప్పటి వరకు నాణ్యతలోపంగా జరిగిన పనులను కప్పిపుచ్చేందుకు సిమెంటుతో పూత వేశారు. గతంతో జరిగిన పనులకు ప్రస్తుతం జరుగుతున్న పనుల నాణ్యతలో తేడా స్పష్టంగా కనిపిస్తోంది.

గీత కార్మికుల సంక్షేమానికి చర్యలు చేపట్టాలి



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న సంఘం సభ్యులు

ఖిలా వరంగల్: గీత పనివారల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, ప్రమాదవశాత్తు మరణించిన కుటుంబానికి రూ.10లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని వృత్తి సంఘాల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్రాములు డిమాండ్ చేశారు. పనివార సంక్షేమం సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్ బైరి తిరుపతి ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకట్రాములు మాట్లాడుతూ అడుగడుగునా బెల్ట్ షాపులు విస్తరించడంతో గీత వృత్తి ప్రమాదంలో పడిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. నేటికీ గీత వృత్తిపై ఆధారపడి లక్షలాది మంది జీవిస్తున్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి, సహాయ కార్యదర్శి షేక్ బాషుమియా, బైరి లక్ష్మినారాయణ, కుమారస్వామి, రమేష్ పాల్గొన్నారు.

సామాజిక సేవే రోటరీ క్లబ్ ధ్యేయం



అవార్డులు అందుకున్న అధికారులు, ప్రతినిధులు

ఖిలా వరంగల్: బడుగు బలహీన వర్గాల పేదలు, పేద విద్యార్థులకు చేయూతనివ్వడం, సామాజిక సేవ చేయడమే రోటరీ క్లబ్ ధ్యేయమని రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ పూర్వ డిస్ట్రిక్ గవర్నర్లు డాక్టర్ శరత్‌కుమార్, ఎన్వీ.హనుమంతరెడ్డి, అసిస్టెంట్ గవర్నర్ రామగిరి రవీందర్ అన్నారు. వరంగల్ ఫోర్ట్‌రోడ్డులోని రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ భవనంలో అధ్యక్షుడు దీకొండ నరసింహారావు అధ్యక్షతన పలు ప్రభుత్వ శాఖల అధికారులకు ఒకేషనల్ ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఉత్తమ సేవలందించిన పలు శాఖల అధికారులకు అవార్డులు, మెమోంటోలు అందజేసి సత్కరించారు. అలాగే 600కిలోమీటర్ల సైక్లింగ్ పోటీలో 40 గంటల్లో లక్ష్యాన్ని ఛేదించిన కోడూరు శివప్రసాద్‌ను సన్మానించారు.

అవసరార్థులకు అండగా లయన్స్ క్లబ్‌లు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రూబెన్ మార్క్

హన్మకొండ కల్చరల్: అవసరార్థులకు తామున్నానంటూ అండగా నిలుస్తూ సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్న లయన్స్ క్లబ్‌లను ఆదర్శంగా తీసుకోవాలని బిషప్ రెవరెండ్ రూబెన్ మార్క్ సూచించారు. హనుమకొండలో సింగిడి లయన్స్ రీజియన్ మీట్ ఆదివారం రాత్రి జరిగింది. లయన్ ఉషామార్త ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ప్రముఖ విద్యావేత్త లయన్స్ మాజీ గవర్నర్ దుర్గాబాయి సురభి మాట్లాడుతూ లయన్స్ క్లబ్‌లలో మహిళల పాత్ర మరింతగా పెరగాలని అన్నారు. ఉషామార్త మాట్లాడుతూ సింగిడి రీజియన్‌లోని ప్రతిక్లబ్ సేవా కార్యక్రమాల్లో పోటీపడిందని అన్నారు. కార్యక్రమంలో ఉపగవర్నర్ వెంకటేశ్వరరావు, మాజీ గవర్నర్లు ప్రొఫెసర్ గోపాల్‌రెడ్డి, చందర్, శ్రీనివాస్‌రావు, లక్ష్మినరసింహారావు, నాయకులు రవీందర్, ప్రభాకర్, మాజీ ఏసీపీ సంజీవరావు, జోన్ చైర్మన్లు వెంకట రామారావు, సుభాష్, నరేందర్ పాల్గొన్నారు.

జాతీయ సమైక్యత శిబిరానికి కేడీసీ విద్యార్థి



రాజశేఖర్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, తదితరులు

విద్యారణ్యపురి: కర్ణాటక రాష్ట్రంలోని మైసూర్‌లో ఫిబ్రవరి 3నుంచి 9వరకు నిర్వహించనున్న జాతీయ సమైక్యత శిబిరానికి హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి మానుపాటి రాజశేఖర్ ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ రాజారెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ రాంబాబు, డాక్టర్ వినోద్‌రావు, డాక్టర్ సాయిలు తెలిపారు. వారం రోజులపాటు కొనసాగనున్న శిబిరంలో కాకతీయ యూనివర్సిటీ తరపున బృందంలో రాజశేఖర్ పాల్గొంటారని పేర్కొన్నారు. ఈమేరకు రాజశేఖర్‌ను ప్రిన్సిపాల్‌తో పాటు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు, అధ్యాపకులు అభినందించారు.

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో 2కే రన్

వరంగల్ అర్బన్: మహాత్మగాంధీ వర్ధంతిని పురస్కరించుకొని వాసవి క్లబ్ ఆధ్వర్యంలో 2కే రన్ (శాంతి పరుగు)ను సోమవారం నిర్వహించారు. వరంగల్ చౌరస్తాలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ దాచేపల్లి సీతారాం, జిల్లా క్లబ్ కన్వీనర్ వల్లాల పృథ్వీరాజ్.. జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు. ఈమేరకు చౌరస్తా నుంచి ఎస్వీఎన్ రోడ్డు, పాపయ్యపేట చమన్, బల్దియా ప్రధాన కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం బల్దియా ప్రధాన కార్యాలయం ఆవరణలోని మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అతర్వాత బల్దియా పారిశుద్ధ్య సిబ్బందికి దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ జిల్లా వైస్ గవర్నర్ గంప సాంబమూర్తి, వాసవి క్లబ్ అభ్యుదయ, వాసవి క్లబ్ ప్రతాపరుద్ర, వాసవి క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.